క్లుప్తంగా

స్నేహితుడి జ్ఞాపకార్థం చలివేంద్రం



ముక్కామలలో చలివేంద్రాన్ని ప్రారంభించిన నాగరాజు మిత్రులు

పెరవలి: మండలంలోని ముక్కామల గ్రామానికి చెందిన అవిడి నాగరాజు జ్ఞాపకార్థం ఆయన మిత్రులు ఆ గ్రామ కూడలిలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రంతో ముక్కామల, ముత్యాలవారిపాలెం, ఉమ్మిడివారిపాలెం గ్రామాల ప్రజల, ప్రయాణికుల దాహార్తి తీరుతుందని నాగరాజు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు తెలిపారు.

ఆశ్రమంలోని వృద్ధులకు వస్త్రాల పంపిణీ



వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు స్వర్ణలత

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వృద్ధుల మెమోరియల్ ట్రస్ట్ ఆశ్రమంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, ఆశ్రమం నిర్వాహకురాలు జి. శ్యామలాదేవి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. వృద్ధాశ్రమం నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండల కన్వీనర్ కదలి హైమావతి, యర్నగూడెం ఎంపీటీసీ సభ్యుడు బొంతా చినబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి సాయిఈశ్వరరెడ్డి, కురువెళ్ల భానుచందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధనలు

నిడదవోలు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మండలంలోని సమిశ్రగూడెం, కలవచర్ల గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. యువతకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జైభీమ్ యూత్ సభ్యులు, స్థానిక నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనంతపల్లిలో..

నల్లజర్ల: అంబేడ్కర్ జయంతి సందర్భంగా అనంతపల్లి ఇందిరమ్మ కాలనీలో శ్రమ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వెయ్యి మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు ప్రత్యేక వాహనంపై యూత్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. యూత్ అధ్యక్షుడు జువ్వాల రాజు, సభ్యులు బేతపూడి రామకృష్ణ, కాకి షడ్రక్, కుమ్మరి శ్రీను, గుడిశే చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో వైద్య శిబిరం

కొవ్వూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదిత్య ల్యాబ్, వజ్ర వనితా వాసవీ క్లబ్ సంయుక్తంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 182 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యుడు ఉదయ్ చాణుక్య, చర్మ వ్యాధుల వైద్యులు శ్రీహరిరెడ్డి, జనరల్ ఫిజీషియన్ పి.రామకృష్ణ రోగులకు సేవలు అందించారు. వజ్ర వనిత వాసవీ క్లబ్ అధ్యక్షురాలు మద్దుల వెంకటలక్ష్మి రూ.30 వేల విలువైన మందులను రోగులకు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు మద్దుల వీర వెంకట సత్యనారాయణ, కోట్ల రాఘవ, వాసవీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రవి, కార్యదర్శి ఎన్.తేజ, చక్కా గౌతమ్ పాల్గొన్నారు.

చాగల్లులో 245 మందికి..

చాగల్లు: స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ మెమోరియల్ అసోసియేషన్, మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా ఆస్పత్రి వైద్యులు పలు రకాల వ్యాధులకు, నిడదవోలుకు చెందిన జాగృతి కంటి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 245 మందికి వైద్య సేవలు అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. తలసేమియా బాధితుల కోసం ప్రత్యేకంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

విద్యార్థిని అదృశ్యంపై కుటుంబీకుల ఆందోళన

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడేనికి చెందిన 9వ తరగతి విద్యార్థిని అదృశ్యమైంది. పోతవరం హైస్కూల్లో చదువుకునేందుకు ఈనెల 9న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన ఆ బాలిక తిరిగి రాలేదు. దీనిపై ఆ బాలిక తల్లిదండ్రులు అదే రోజున నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం గడుస్తున్నా తమ కుమార్తె ఆచూకీ తెలుసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తూ ఆ బాలిక తల్లిదండ్రులు, సమీప బంధువులు, చీపురుగూడెం గ్రామస్తులు ఆదివారం సాయంత్రం నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.తమ సమస్య పట్టించుకోవడం లేదని ఆరోపించారు.దీనిపై ఎస్ఐ నరసింహామూర్తిని వివరణ కోరగా ఈ కేసులో అనుమానితులను గుర్తించి విచారణ చేస్తున్నామని త్వరలోనే దోషులను అరెస్ట్ చేస్తామన్నారు.

తీరని పట్టణ వాసుల దాహార్తి

- కొవ్వూరు తాగునీటి ప్రాజెక్టుకు రూ.58.07 కోట్ల రుణం
- గోదావరి జలాల శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదన
- పనులకు రెండు దశల్లో టెండర్లు
- రెండో దశలో 20 శాతం పనుల పూర్తి
- మొదటి దశ డిజైన్ మార్పుతో ఖరారు కాని టెండర్లు
- శివారు ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా



కొవ్వూరు పట్టణ శివారు జగనన్న లే అవుట్‌కు ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



గోదావరి జలాల మళ్లింపులో భాగంగా కొవ్వూరు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్

కొవ్వూరు: చెంతనే జీవ నది గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాల ప్రజలకు వేసవిలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రెండు పట్టణాల్లోనూ ఏళ్ల తరబడి శివారు ప్రాంత వాసులకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ దప్పిక తీర్చాల్సిన పరిస్థితి. రోజువారీ కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఒక్కో మనిషికి (లీటర్ ఫర్ క్యాపిటల్) 135 లీటర్ల చొప్పున తాగునీటిని అందించాలి. అయితే కొవ్వూరు పట్టణంలో 110 లీటర్లు, నిడదవోలులో 102 లీటర్ల వంతున ప్రస్తుతం నీటిని సరఫరా చేస్తున్నారు. విజ్జేశ్వరం ఆనకట్ట వద్ద నుంచి పైప్‌లైన్ ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు గోదావరి జలాలను తరలించి తాగునీటి సమస్య తీర్చాలని ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ఏళ్లు గడుస్తున్నా అది కార్యరూపం దాల్చడం లేదు. ఈ ప్రతిపాదన అమలైతే నిడదవోలు పట్టణానికి పుష్కలంగా తాగునీరు సరఫరా అవుతుంది. గోదావరి నీటిని శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వారా కొవ్వూరు పట్టణ వాసులకు సరఫరా చేసేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐఏ) నుంచి ఫైనాన్స్ అసిస్టెన్స్ కింద రూ.58.07 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండు ప్యాకేజీలుగా ఈ పనులను చేపట్టారు. మూడేళ్లు గడుస్తున్నా అవి పూర్తికాకపోవడంతో పూర్తిస్థాయిలో ప్రజల దాహార్తిని తీర్చలేకపోతున్నారు. వేసవి తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు కొవ్వూరు మున్సిపాలిటీ ఈ ఏడాది రూ.35 లక్షలు కేటాయించింది.

గోదావరి జలాలతో..

గోదావరి నుంచి కొవ్వూరు వద్ద నీటిని మళ్లించి ట్రీట్‌మెంటు ప్లాంట్ నిర్మించి, పైప్‌లైన్ ద్వారా పట్టణ ప్రజలకు సరఫరా చేసేందుకు రెండు ఫేజుల్లో 2020 లోనే టెండర్లు పిలిచారు. మొదటి ఫేజ్‌లో రూ.28.50 కోట్ల వ్యయంతో గోదావరిలో ఇన్ టేక్ వెల్, ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనుల కాంట్రాక్ట్‌ను హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అండ్ గజా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ దక్కించుకుంది. ఈ మేరకు 2021 ఆగస్టు 18న ఆ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కూడా జరిగింది. తీరా డిజైన్లు మార్చడంతో మళ్లీ రీ టెండర్లు పిలవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

తాగునీటి డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ల ఏర్పాటు కోసం 2020 ఫిబ్రవరి 20న రూ.29.49 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన గజా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. మొత్తం కొవ్వూరు పట్టణంలో వివిధ రకాల పైప్‌లైన్లు 79.657 కిలోమీటర్ల పొడవునా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే 60 శాతం పనులను ఆ సంస్థ పూర్తి చేసింది. వాస్తవంగా ఈ పనులు ఈ ఏడాది జూన్ నెలాఖరుకు పూర్తికావాలి. నిధుల కొరత వల్ల పనులు ముందుకు సాగడం లేదని చెబుతున్నారు.

మూడు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా..

కొవ్వూరు పట్టణంలోని బ్రిడ్జిపేట, వాంబే కాలనీ, ఇందిరమ్మ కాలనీల వాసులు తాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ప్రజల అవసరాల మేరకు పైపుల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. ట్యాంకర్ల ద్వారా ఈ కాలనీలకు తాగునీటిని అందిస్తున్నారు. కొవ్వూరులో కొత్తగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో బోర్లు ఉన్నప్పటికీ ఇంకా ఇక్కడ ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయడంతో ట్యాంకర్ ద్వారా వారికి నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక నిడదవోలు మునిసిపాలిటీలోని వైఎస్సార్ కాలనీ, ఇందిరా నగర్, రావిపేట ప్రాంతాలకు కొన్నేళ్లుగా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు.

టెండర్లు ఖరారయ్యాక పనులు



గోదావరి జలాలను శుద్ధి చేసి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ప్లాంట్ ఏర్పాటుకు రూ.58.07 కోట్లు మంజూరయ్యాయి. రెండో ఫేజ్‌లో పైప్‌లైన్ నిర్మాణ పనులు పట్టణంలో ఇరవై శాతానికి పైగా పూర్తయ్యాయి. మొదటి ఫేజ్‌లో గోదావరిలో ఇన్ టేక్ వెల్, శుద్ధి చేసే ప్లాంట్ నిర్మించాలి. వాటి డిజైన్లు ఖరారు కాకపోవడంతో టెండర్లు పిలవడం ఇంకా పూర్తి కాలేదు. టెండర్లు ఖరారైతే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

–బి.శ్రీకాంత్, మునిసిపల్ కమిషనర్, కొవ్వూరు మున్సిపాలిటీ

దేవరపల్లికి ఆర్టీఓ ఆఫీసు మంజూరు



తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

దేవరపల్లి: దేవరపల్లికి రోడ్డు రవాణా అధికారి (ఆర్టీఓ) కార్యాలయాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం వెల్లడించారు. త్వరలోనే ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాల పునర్విభజన అనంతరం గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాలు పశ్చిమగోదావరి జిల్లా నుంచి వేరు చేసి తూర్పుగోదావరి జిల్లాలో కలపడం వల్ల నియోజకవర్గానికి పలు ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వం మంజూరు చేసింది. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కృషితో పలు కార్యాలయాలు ఒక్కొక్కటిగా వస్తున్నాయి. ఇప్పటికే పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఎస్ఈబీ సర్కిల్ స్టేషన్, సాంఘిక సంక్షేమశాఖ సహాయాధికారి కార్యాలయాలను ఏర్పాటు చేశారు. పోలీస్ సర్కిల్, ఈఎస్ఈబీ సర్కిల్ స్టేషన్, ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం, ఆర్టీఓ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మిస్తామని, అవసరమైన స్థలాలను సేకరిస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకలకు విస్తరించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, దీనివల్ల పాలనా సౌలభ్యం ఏర్పడుతుందని తలారి చెప్పారు.

ఇఫ్తార్ విందులో మంత్రి వనిత



కొవ్వూరు జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న హోం మంత్రి వనిత తదితరులు

కొవ్వూరు: మండు వేసవిలో భక్తిశ్రద్ధలతో ముస్లింలు రంజాన్ ఉపవాసాలు పాటించడం హర్షణీయమని హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని జామియా మసీదులో ఆదివారం సాయంత్రం ముస్లింల ఇఫ్తార్ విందులో మంత్రి వనిత పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మసీదు ఇమామ్ షామీవుర్ రెహమాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని కోరారు. ముస్లింలందరికీ స్వీట్ బాక్సులు పంచారు. అనంతరం మంత్రి వనిత ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు ఆరగించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గంగ్రోతు అంజనీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్ష , గౌరవా ధ్యక్షులు నగళ్లపాటి శ్రీనివాస్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, ముస్లిం నాయకులు మునిసిపల్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మహ్మద్ అలీ,అబ్దుల్ రెహమాన్, సయ్యద్ అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మసీదులో..

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడి మసీదులో ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండలశాఖ అధ్యక్షుడు జె. వెంకటేశ్వరరావు, రీజినల్ చైర్మన్ వి. చంద్రయ్య, మసీదు కమిటీ అధ్యక్షుడు సర్దార్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి సేవల చిరస్మరణీయం

కొవ్వూరు: స్త్రీ జనోద్ధారకుడు కందుకూరి వీరేశలింగం పంతులు 175వ జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్లో ఆదివారం నిర్వహించారు. కందుకూరి చిత్ర పటానికి రాష్ట్ర మంత్రి తానేటి వనిత పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా సంఘ సంస్కర్తగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకుడు పెనుమాక జయరాజు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుల వీర వెంకట సత్యనారాయణ, తిగిరిపల్లి మోహన్‌రావు, శ్రీరంగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాల్లో సమస్యలుంటే ఫోన్ చేయండి

ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: రబీ ధాన్యాన్ని అమ్ముకోవడంలో రైతులకు ఏమైనా సమస్యలు ఎదురైతే ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్నీ మండల కేంద్రాల్లోను కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. డివిజన్ రెవెన్యూ కార్యాలయంలో 94402 95493 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- హోం మంత్రి తానేటి వనిత
- 8వ వార్డులో రెండో రోజూ గడప గడపకూ..



ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రజలను కోరారు. పట్టణంలోని 8వ వార్డులో రెండో రోజు ఆదివారం ఆమె గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే కుటుంబానికి ఏమేర మేలు చేకూరిందో లెక్కలతో సహా వివరించారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా భవిష్యత్తులో మరింత మందికి మేలు చేకూరుతుందన్నారు.పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, స్థానిక కౌన్సిలర్, వైస్ చైర్‌పర్సన్ గంగ్రోతు అంజనీదేవి, మరో వైస్ చైర్ పర్సన్ మన్నె పద్మ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, పోసిన శ్రీకృష్ణ దేవరాయలు, రాచర్ల రవీంద్ర, తోట రామకృష్ణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బయటి వ్యక్తుల వల్లే అవాంఛనీయ ఘటనలు

- 21 వరకూ వేగేశ్వరపురంలో 144 సెక్షన్ అమలు
- శాంతి భద్రతల సమస్య లేకుండా చర్యలు
- అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ వెల్లడి



తాళ్లపూడి పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని, గ్రామంలో పోలీసులు బలగాలను ఏర్పాటు చేసినట్టు అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ గ్రామంలో ఈ నెల 14న అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఆదివారం నుంచి గ్రామంలో 144 సెక్షన్ అమలు చేశారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు పహారా కాశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ ఆదివారం తాళ్లపూడి పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఆ రెండు సామాజిక వర్గాల వారూ ఎప్పటి నుంచో సఖ్యతగానే ఉంటున్నారన్నారు. బయటి వ్యక్తులు రావడం వల్ల సమస్య తలెత్తిందన్నారు. బయటి వ్యక్తులను గుర్తిస్తామన్నారు. దీనిపై ఎవరూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టి రెచ్చగొట్టవద్దన్నారు. అటువంటి వారిపై చర్యలు ఉంటాయన్నారు. డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ ఈనెల 14న అంబేడ్కర్ జయంతి నాడు రెండు వర్గాల మధ్య స్వల్ప ఉద్రిక్త పరిస్థితి నెలకొందన్నారు. ఆ రోజు నుంచి గ్రామంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రెండు వర్గాల వారు ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకున్నారని చెప్పారు. వాటిపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. బయటి వ్యక్తులు ఇక్కడకు వచ్చి రెచ్చగొడితే సహించేది లేదన్నారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని కోరారు.ఈ నెల 21 వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కాగా గ్రామంలోని పెట్టా వారి వీధిలోని రామాలయం వద్దకు రాత్రి వేళ కొందరు వ్యక్తులు వచ్చి బీరు సీసాలు పగలగొట్టి బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురి చేసినట్టు మహిళలు చెబుతున్నారు.

రెండు వర్గాల ముఖ్య నాయకుల సమావేశం

ఇదిలా ఉంటే సమస్య శాంతియుతంగా పరిష్కరించడానికి వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కైగాల శ్రీనివాసరావు, నామన పరమేశ్వరరావు, యాళ్ల బాబురావు, గూడా విజయరాజు, పిట్టా శ్రీనివాస్, కంభం శివ, భీమయ్య, మెంటే వెంకటేష్, ఆశోక్, శీర్ల బ్రహ్మానందం, తైలం బాజ్జి, బుద్దాల గాంధీ, వంబోలు పోశిబాబు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, రవి తదితరులు చర్చించారు.

పీపుల్స్ సర్వేలో సంక్షేమ పాలనకే మద్దతు



ప్రభుత్వ పాలనపై తాడిమళ్లలో ప్రజా సర్వే చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, పార్టీ శ్రేణులు



ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో ఓ ఇంటి వద్ద నేలపై కూర్చుని మహిళ అభిప్రాయాన్ని సేకరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



గోపాలపురం మండలం హుకుంపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాడిమళ్లలో జగనన్నే మా భవిష్యత్తు

నిడదవోలు రూరల్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పీపుల్స్ సర్వేలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతు ఇస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన జగనన్నతోనే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం అయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అభిప్రాయాలు తెలుసుకుని ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నాలుగేళ్లుగా జగన్ ప్రభుత్వం చేసిన మంచి పనులనే వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి పనులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, పార్టీ నాయకులు కాపకాయల సూర్యనారాయణ, తిరుమళ్ల దుర్గారావు, మానుకొండ చంద్రబాబు, కాగిత లక్ష్మయ్య, సత్తిపండు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు విశేష స్పందన

ద్వారకాతిరుమల: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని దొరసానిపాడులో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఎమ్మెల్యే తలారి ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని, మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు చిన్ని, సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు, ఎంపీటీసీ అల్లాడ హరే రామకృష్ణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, మద్దిపాటి చిన్న సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారంతో మండలంలో 80 శాతం పూర్తయినట్టు మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ తెలిపారు. ఈనెల 20తో నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. మండలంలోని 18 పంచాయతీల పరిధిలోని 20 సచివాలయాల్లో ప్రస్తుతం ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుల సహకారంతో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. హుకుంపేటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మండల మాజీ కన్వీనర్ ఎస్‌కే వల్లీ, మండల మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



మార్కొండపాడులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ మట్టా వీరాస్వామి

చాగల్లు: మార్కొండపాడులో ఎంపీపీ మట్టా వీరాస్వామి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు కలసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వారందరూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరాస్వామి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు. బ్రాహ్మణగూడెంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు నిర్వహించారు.

తొలివిడతగా 15 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



అజ్జరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

పెరవలి: రైతుల సౌలభ్యం కోసం రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ముందుగానే తెరిచింది. మండలంలో 20 కేంద్రాలు తెరవాల్సి ఉండగా, ఇప్పటికే 15 కేంద్రాలను తెరిచినట్టు తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆమె పరిశీలించారు. రబీ ధాన్యం మాసూళ్లు మొదలైనందున అందుకనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్టు ఆమె తెలిపారు. ఇప్పటికే ఆయా కేంద్రాలకు గోనె సంచులను సమకూర్చామన్నారు. మాసూళ్లు పూర్తి చేసిన రైతులు ఆర్‌బీకేలకు వచ్చి తమ ధాన్యంలోని నిమ్ము శాతాన్ని పరీక్షించుకుని అవసరమైన సంచులను పట్టుకెళ్లాలని తెలిపారు. ఇప్పటికే మండలంలోని కానూరు, నడుపల్లి, ఉసులుమర్రు, తీపర్రు, అజ్జరం, కాకరపర్రు, కాపవరం గ్రామాల్లో వరి మాసూళ్ళు ప్రారంభం అయ్యాయని తహసీల్దార్ తెలిపారు.

దస్తావేజులు పోయినవి

ప.గో. జిల్లా, తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన కోటి నాగరత్నం W/O అప్పారావు అను నాకు చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్లు నెం.1808/2006 ప్రక్కిలంక లో వేరొక ఇంటికి మారుచుండగా పోయినవి. కావున దొరికిన వారు అందజేయగలరు. ఇట్లు,

కోటి నాగరత్నం ప్రక్కిలంక, 8309027174